గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో..

- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- జిల్లా వ్యాప్తంగా ఆడిపాడిన మహిళలు, యువతులు
- అలరించిన వేడుకలు

నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బిచ్కుందలో బతుకమ్మను ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మహ్మద్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

భిక్కనూరులో..

కామారెడ్డిలో..

పోచారం గ్రామంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 10 : గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు, యువతులు జిల్లావ్యాప్తంగా గురువారం ఆడిపాడారు. సద్దుల బతుకమ్మ పండుగను గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రధాన కూడలి వద్ద ఉంచి లయబద్ధంగా ఆడుతూ బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. అనంతరం చెరువులు, కుంటలు, కాల్వల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఇంట్లో ప్రత్యేకంగా వండిన వంటలను ఆరగించారు. బాన్సువాడ మండంలోని పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి సతీసమేతంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బిచ్కుందలో బతుకమ్మ సంబురాల్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని మహిళలతో బతుకమ్మ ఆడారు. నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూర్‌లో మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. మహ్మద్‌నగర్‌లో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ గ్రామస్తులతో కలిసి బతుకమ్మ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. కామారెడ్డిలోని సాయిబాబా ఆలయం, విద్యుత్ నగర్ కాలనీ, సిరిసిల్ల రోడ్‌లోని ధర్మశాల, పంచముఖీ హనుమాన్ ఆలయం, కర్షక్ బీఈడీ కళాశాల ఆవరణ, గాంధీ గంజ్‌లో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. చివరి రోజైన గురువారం సద్దుల బతుకమ్మను ఆడపడుచులు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. సద్దుల బతుకమ్మను పోయిరావమ్మా అంటూ మహిళలు సాగనంపారు. బతుకమ్మలను కామారెడ్డి చెరువులో, ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన కుంటల్లో నిమజ్జనం చేశారు.

రెడ్డిపేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇబ్రహీంపేట్‌లో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

బస్వన్నపల్లిలో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు

కోమలంచలో

నస్రుల్లాబాద్ ఓల్డ్ విలేజ్‌లో..

బేగంపూర్‌లో..

లింగంపేటలో..

గోలిలింగాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎల్లారెడ్డి మండలం జంగమాయపల్లి గ్రామంలో..

జాతీయ తపాలా దినోత్సవం

తపాలా సిబ్బందిని సన్మానిస్తున్న భారతీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, న్యాయవాది రాజాబాబుగౌడ్

భిక్కనూరు, అక్టోబర్ 10 : మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో జాతీయ తపాలా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని భారతీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లింగాల రాజాబాబుగౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని అన్నా రు. ఆధునిక ప్రపంచంలో నూతన సదుపాయాలు ఉన్నప్పటికీ తపాలా శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాకేశ్, శ్రీనివాస్, రాజు, రవి, నరేశ్, చంద్రశేఖర్‌గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని ఒకరి మృతి

మాచారెడ్డి, అక్టోబర్ 10 : ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం భవానీపేట గ్రామశివారులో గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపేట గ్రామానికి చెందిన గంగాని రాములు (50) వేకువ జామున గ్రామం నుంచి పొలం వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామశివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద లారీ రిపేర్ సమస్యతో రోడ్డుపై నిలిపారు. రాములు లారీని గమనించక ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

లింగ నిర్ధారణ పరీక్ష చేస్తున్న వ్యక్తి అరెస్టు

రాజంపేట్, అక్టోబర్ 21 : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బల్ల రవి గతంలో ఓ ప్రైవేట్ దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఇంటి వద్దనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడనే ఆరోపణలు రావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సీసీఎస్ పోలీసులు ఇంటిపై దాడులు నిర్వహించారు. స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకొని రవిని అదుపులోకి తీసుకున్నారని సమాచారం. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

దేవీ మండపంలో డీఎస్పీ పూజలు

అన్నాసాగర్ దుర్గా మండపం వద్ద పూజలు చేసిన డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 10 : మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో నెలకొల్పిన దుర్గామండపం వద్ద గురువారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్, మాజీ సర్పంచ్ పెరుగు నాగరాజు, వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దండి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 10: పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెడుతున్నారని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని శాఖా గ్రంథాలయం వద్ద కొత్తగా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులను వారు ఘనంగా గురువారం సన్మానించారు. స్థానిక నాయకులు విద్యాసాగర్, నునుగొండ శ్రీనివాస్, జంగం నీలకంఠం అప్ప, పోచయ్య, తిరుపతి, అల్లం శ్రీను, గణేశ్, తదితరులు ఉన్నారు.

డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 10 : రెండు రోజుల క్రితం వచ్చిన ఎస్టీజీ ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 5 గంటలలోగా డీఈవో కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఈవో రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ - 2024 నియామకాలలో భాగంగా వివిధ కేటగిరీల్లో 1:1లో ఉండి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు తీసుకున్న అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

వంటసామగ్రి అందజేత

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 10 : పిట్లం ఎస్సీ కాలనీలో వారం రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వంటసామగ్రి, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నవీన్, బాన్సువాడ డివిజన్ చైర్మన్ వేణుగోపాల్, రాజు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ పల్లకీ సేవ

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 10: ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం రాత్రి వైశ్యభవన్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి పల్లకీసేవ, అశ్వరూఢ రథంతో కలిసి భారీ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కంచర్ల బాల్‌కిషన్, ఎల్లారెడ్డి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముత్యపు సుదర్శన్, వేదపండితుడు కొండంబొట్ల రాజేశ్వర శర్మ, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడ, అక్టోబర్ 10 : బాన్సువాడలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో విజయ దశమి సందర్భంగా నిర్వహించే రావణ దహన కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబర్ 10 : ఎగువ భాగం నుంచి వరద నీరు 5000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండడంతో గురువారం సాయంత్రం రెండు గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి, 1000 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వ ద్వారా ఆయకట్టుకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1404.92 అడుగులు (17.687 టీఎంసీ లు) నీరు నిల్వ ఉందని ఆయన వివరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
FLAT FOR SALE
★నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK Flats అమ్మబడును. సప్రః శ్రీ గణేష్ రెసిడెన్సీ, శ్రీనగర్ కాలోని, వినాయక్ నగర్, నిజామాబాద్, సెల్: 7422998999.
NTZ-334472
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మోటివేషనల్ తరగతులు నిర్వహించాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 10 : కళాశాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా మోటివేషనల్ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం జిల్లాలో ఇంటర్ తరగతుల్లో ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందని, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. అందుకు ముందస్తు ప్రణాళికతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు క్లాస్‌లకు తప్పని సరిగా హాజరయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మోటివేషనల్ సినిమాలను ప్రదర్శించాలన్నారు. ప్రతి నెలా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. కొన్ని కళాశాలల్లో తక్కువ ఉత్తీర్ణత శాతం ఉందని, ఆ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన అందించాలన్నారు. విద్యార్థుల హాజరు విషయంలో ఆయా సబ్ కలెక్టర్లు, ఆర్డీవోల సహకారం తీసుకోవాలన్నారు. ఐఐటీలో అడ్మిషన్ పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.

ఆర్టీసీ బస్సుల విషయం ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడుతానని చెప్పారు. వచ్చే రోజుల్లో తన పర్యటనల్లో జూనియర్ కలాశాలను తనిఖీ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపళ్లు మాట్లాడుతూ.. విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకోవడం వరకు మాత్రమే జరుగుతున్నదని, తర్వాత క్లాసులకు హాజరు కావడం లేదన్నారు. కళాశాల ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటల తర్వాత బస్సులు లేకపోవడంతో విద్యార్థులు 3 గంటలకే వెళ్లి పోతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి సలాం, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తప్పనితిప్పలు

జుక్కల్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

బిచ్కుంద, అక్టోబర్ 10 : పండుగలవేళ జుక్కల్ నియోజక వర్గ ప్రజలు తాగు నీటి కోసం ముప్పు తిప్పలు పడుతున్నారు. ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో జనం నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటిని నమ్ముకున్న ప్రజలు గుక్కెడు నీటికోసం ముప్పతిప్పలు పడుతున్నారు. బతుకమ్మ, దసర పండుగ పూట ఇంటికి వచ్చిన బంధువులు సైతం తమకు సరిపడా నీటిని తాము మోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పండుగలను సైతం మొక్కుబడిగా జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని జనం వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి కొరత తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 10 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. పెద్ద కొడప్‌గల్ నుంచి గురువారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండడంతో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన

దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీవో

లింగంపేట, అక్టోబర్ 10 : మండల కేంద్రంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మండల పంచాయతీ అధికారి మలహరి పరిశీలించారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంలో గృహ యజమానులు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ప్లాట్ల వద్దకు వెళ్లి స్థితిగతులను పరిశీలించారు. లింగంపేట పంచాయతీలో 1164 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.